బలం

కథానిక

సదానంద్ శారద

"నానీ ఆ చింతకాయ ఎక్కడిదిరా? - చెప్పు?" కోపంగా అడిగింది తల్లి.

నాని భయపడ్డాడు - నోట్లో వేలు పెట్టుకొని భయం భయంగా తల్లి ముఖం కేసి చూడసాగాడు.

"నీకు ఆడుకోవడానికి ఎవరూ దొరకలేదా? ఆ చాకలి పిల్లలతో ఆడుతున్నావా ... ఇంకోసారి ఆడుతావా? చాకలి ఇండ్లకు పోతావా చెప్పు" అంటూ నానిని కొట్టసాగింది నీలవేణి.

"వెళ్ళనమ్మా ... ఓమ్మ వెళ్ళనమ్మా ..." అంటూ ఆమె చేతుల్లోంచి తప్పించుకోవడానికి అటూ ఇటూ గింజుకోసాగాడు నాని.

"వెధవ ... ఇంకోసారి ఆ తక్కువ జాతి ఇండ్లకు వెళ్లావో వీపు చీరేస్తా జాగర్త - " అంది నీలవేణి కొడుకును వదిలేస్తూ -

"ఊఁ ... ఊఁ ..." అని ఏడుస్తూ అంగీ చివరతో కండ్లు వొత్తుకోసాగాడు నాని.

ప్రక్కగదిలో నుంచి తొంగి తొంగి చూస్తున్నది చంటిది. "నానిగాడి పని బాగా అయింది. లేకపోతె నాకివ్వకుండా తింటాడా చింతకాయ" అనుకుంటున్నది. నానిని అమ్మ కొట్టినందుకు ఎంతో సంబరపడసాగింది.

"వింటున్నావే చంటిదాన ... నువ్వు వెళ్తే నీ వీపు అంతే ..." అంది నీలవేణి.

అమ్మో! అనుకుంటూ తుర్రున అక్కడినుంచి పారిపోయింది చంటిది.

నీలవేణి భర్త రామిరెడ్డి తనకున్న నాలుగెకరాల పొలాన్ని సాగుచేస్తూ మామూలుగా సంసారాన్ని నడుపుకొస్తున్నాడు. 'మామూలుగా' అని ఎందుకు అనాల్సి వస్తున్నదంటె ఆ ఊళ్లో అంత తక్కువ పొలం వున్న రెడ్డి కుటుంబం మరోటి లేదు. ఉన్న ఇరవై ముప్పై రెడ్డి ఇండ్లు ఒక దగ్గతే ఉన్నాయి. - వాళ్ళ పొలాలు ఒక దగ్గతే ఉన్నాయి. ఆ ఇండ్లు దాటిన తరువాత చెఱువు కట్టకు దగ్గఱగా చాకలి ఇండ్లు ఉన్నాయి. ఆ చాకలి ఇండ్లు దాటితే చింతల తోపు, ఆ తరువాత పొలాలు ఉన్నాయి.

రెడ్లలో నరసింహారెడ్డిని పెద్ద దొర అంటారంతా నూరు ఎకరాలకు పైగా పొలం, నాలుగైదు దొడ్ల పశువులు, నౌకర్లు ఉన్నారు పెద్ద దొరకు. అతని కంటికి రామిరెడ్డిలాంటి వాండ్లు క్రిమి కీటకాల్లా కనిపిస్తారు.

ఈమధ్య రామిరెడ్డి కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురికావల్సి వచ్చింది. ఉన్న నాలుగెకరాలలో రెండెకరాలు అమ్మి చెల్లెలి పెండ్లి చేశాడు రామిరెడ్డి. మిగతా రెండెకరాలు ఏ అప్పో తెచ్చి సాగుచేస్తే వచ్చే ఆదాయంలో మూడొంతులు అప్పుతీర్చడానికి, వడ్డీ కట్టడానికే సరిపోతున్నది. అయినా ఎవరితో ఒకమాట పడక తన కష్టం తాను పడుతూ, పరువుగా బతుకు నీడ్చుకొస్తున్నాడు రామిరెడ్డి.

నీలవేణి మనస్తత్వం రామిరెడ్డి మనస్తత్వానికి భిన్నమైందనే చెప్పాలి. రామి

రెడ్డికి తోటి రెడ్ల సంపాదనలు చూసి ఎన్నడూ అసూయ, ద్వేషం కలుగలేదు. ఏదో ఎవరికి వచ్చిన అవకాశం వారిది అనుకునే స్వభావం అతనిది. నీలవేణికి మాత్రం తామలాగ లేమే అన్న బాధ కలుగుతూంటుంది ఎప్పుడూ! – ధనవంతులన్నా, తమ కులం వారన్నా ఆమెకు అభిమానం. పేదలంటే ఆమెకు అసహ్యం. కులభేదం ఆమెలో బాగా నాటుకపోయింది. పేదలతో స్నేహం చేస్తే తామింకా పేదవాండ్లమైపోతామని ఆమె భయం. ధనవంతులతో స్నేహం చేస్తే తాము కూడా వాళ్ళలా ధనవంతులం కాగలమని ఆమె నమ్మకం. అందుకే పిలవకున్నా అప్పుడప్పుడు నర్సింహారెడ్డి ఇంటికి వెళ్ళి వస్తుండేది. అతని పెద్ద భార్య . . . అంటె పెద్ద దొరసానితో చనువు పెంచుకోవాలని ఆమె తపన –

ఒక రోజు నీలవేణి పెద్ద దొరసాని మేడకు పోయేసరికి ఆమె భోజనం చేసి అప్పుడే విశ్రాంతి తీసుకుంటున్నదట, సాయంత్రం రమ్మని చెప్పిందంటూ పనిమనిషి వచ్చి చెప్పింది.

నీలవేణి తిరిగి వస్తుంటె పెద్దొర ఎదురయ్యాడు. అతణ్ని చూసి కంగారుగా భుజాల చుట్టూ కొంగు కప్పుకొంది. అప్పటికే పెద్దొర చూపులు ముండ్లపంది దులిపిన ఈకల్లా ఆమెపై వాలి గుచ్చుకున్నాయి.

మీసాలు మెలేస్తూ ఏదో అన్నాడు. ఆ మాటల్లో తన భర్తను చులకన చేయడం ఆమె గమనించక పోలేదు. తలవంచుకొని గబగబా ఇంటికి వచ్చేసింది. జరిగిన విషయం భర్తకు చెప్పింది. అతని పెదవుల మీద ఒక పేద నవ్వు కదిలింది.

ఇదీ జరిగిన రెండు మూడు రోజులకు మరో సంఘటన జరిగింది –

పెద్దదొర పొలాల తరువాత రామిరెడ్డి పొలం ఉంది. పెద్ద దొరకు ఎన్ని ఉన్నా ఇంకా కావాలనే ఉంటుంది. చివరికి నీళ్ళు కూడా . . . ! రెండు మూడు కరెంటు బావులున్నా, చెఱువు నీళ్ళన్నీ తనకే కావాలని ఉంటుంది పెద్దదొరకు. అసలు ఊరి పొలాలన్నీ తనవే అయితే బాగుండునని ఉంటుంది అతనికి. ఊరి వాళ్ళంతా తన క్రింద పనిజేసే కూలీలై పోవాలి. అయినా ఇప్పుడు మాత్రం ఏం తక్కువైందని ? — ఊరి జనమంతా అతని కూలీలవలె, అతని కాలి కింద చీమల వలె అణిగి మణిగి ఉంటున్నారు.

రామిరెడ్డికి కరెంటు బావి లేదు. మోటబావి లేదు. చెఱువు నీళ్ళే ఆధారం. రామిరెడ్డి పొలం వెంబడి మరి కొన్ని రామిరెడ్ల పొలాలు . . . అంటే అతని వంటి పేద రైతుల పొలాలున్నాయి.

వర్షం పెద్ద దొరగారి కోసమే కురవకపోయినా, చెఱువు పెద్దదొరగారి కోసమే నిండకపోయినా, కాలువలోని నీరు పెద్ద దొరగారి కోసమే పారుతూ లేకపోయినా పెద్ద దొర గారు అవన్నీ తన కోసమే అన్నట్టు వ్యవహరిస్తారు. అతడు దయతలచి వదిలిపెడితేనే క్రింది భూములు తడుస్తాయి. లేకపోతె అవి, వాటిని నమ్ముకున్నవాళ్ళ కడుపులు, బతుకులు కూడా ఎండిపోతాయి.

రెండు నిమిషాలు చాలు కొంచెం నీళ్లు వదలమని కాలువ మీద కాపలా ఉన్న పెద్ద దొర జీతగాన్ని బతిమిలాడాడు రామిరెడ్డి. అది కూడా తొందరపడి కాదు – పొద్దటినుంచి మధ్యాహ్నం దాకా ఇప్పుడు వదులుతాడో అప్పుడు వదులుతాడోనని ఎదురు చూసి ఎదురు

చూసి, అడిగాడు. అప్పటికీ వదలక పోవడంతో దుక్కి ఎండి పోతున్నదని అడిగాడు.

ఆ మాట జీతగాని చెవిన పడలేదు. అలాగని అతనికి చెముడేమీ లేదు. అదో రోగం. పెద్దదొర క్రింద పని చేస్తున్నాడు కదా. అతనికున్న రోగాల్లో కొన్ని అంటుకున్నాయి - పెద్ద దొర చెప్పు క్రింద నలిగే చీమలకు ఆ చెప్పుల రోగం, ఆ చెప్పులు మోసే కాళ్ళరోగం, ఆ కాళ్ళు మోసే మనిషి రోగం అంటుకోవడం సహజమే.

చూసి చూసి, చెప్పి చెప్పి రామిరెడ్డికి విసుగు, కోపం వచ్చాయి.

హాయిగా కాలుమీద కాలు వేసుకొని చుట్ట తాగుతూ ఆ జీతగాడు రామిరెడ్డి మాటలు ఖాతరు చేయలేదు. కనీసం అతని ముఖమైనా చూడలేదు.

కాలువకు అడ్డంగా కట్టిన ఆ పెద్ద కట్టను ఒక పక్క చిన్నగా తెంపేశాడు రామిరెడ్డి.

లేగ దూడకు పాలివ్వడానికి వచ్చే తల్లి ఆవులా రామిరెడ్డి పొలం వైపు ఉరకలు వేస్తూ పారసాగింది, కాలువ లోని నీరు.

పాలు పితకడం కోసం వచ్చిన వాడు లేగ మూతిని కట్టేవేసినట్టు ఆ కట్టను తిరిగి కట్టి —— "ఏం రామిరెడ్డి ఎట్లున్నది ఒళ్లు" అన్నాడు మరో రెడ్డి క్రింద పని చేసే ఆ జీతగాడు.

రామిరెడ్డి అతనివైపు చూసాడు - రెండు రోజుల క్రితం భార్య చెప్పిన విషయం గుర్తుకు వచ్చి ఒళ్లు మండింది.

"నీళ్లు వదులు తావా లేవా?" అని అడిగాడు కోపాన్ని అణుచుకుంటూ రామిరెడ్డి.

. "ఎహెహె . . . . . బెదిరిస్తానవా!" అంటూ హేళనగా నవ్వాడు జీతగాడు.

ఫెడేల్ మని అతని చెంపవాయించి- "మారు మాట్లాడితే కాలువల సాక్షి పెడ్తా జాగ్రత్త" అని ఉరిమి చూస్తూ, అడ్డుకట్ట మొత్తం తెంపేశాడు రామిరెడ్డి.

అతనిలో కట్టలు తెంచుకొని ఉబికి వచ్చిన కోపంలా, పేద రైతుల పొలాల వైపు ఉరకలువేస్తూ పారసాగింది కాలువలోని నీరు.

ఆ జీతగాని కళ్లు గిర్రున తిరిగాయి. "నిన్ను ఏం చేపిస్తనో సూడు" అంటూ కోపంగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

అదంతా లెక్క చేయలేదు రామిరెడ్డి.

విషయం తెలిసి పెద్ద దొర నరసింహా రెడ్డి మండి పడ్డాడు –"వీడు నా నౌకరును కొట్టే మొనగాడయిండా . . ." అని పండ్లు కొరుకుతూ హంటర్ తీసుకొని బయలు దేరాడు.

"నా కాలిగోటికి కొరగాని ఈ కొడుకు నా నౌకర్ను కొడతాడా - వాని అంతుచూస్తా - వాని ముందే వాడి పెళ్లాన్ని ఏం చేస్తానో చూడు" అంటూ బయులుదేరాడు.

ఈ విషయం తెలిసి నీలవేణి పిల్లలను తీసుకొని పొలం దగ్గఱికి పరుగెత్తింది. అక్కడ పొలం దగ్గఱ భర్త ఒంటరిగా ఉన్నాడు. ఆమెకు భయం వేసింది. అక్కడ ఒక క్షణం కూడా ఉండొద్దని ఊళ్ళోకి వెళ్దామని తొందర చేసింది. కాని రామిరెడ్డి ఒప్పుకోలేదు. "ఎవడొస్తాడో చూస్తా . . ." అంటూ పార భుజం మీద పెట్టుకున్నాడు. ఆమె ఎంత బతిమాలినా, ఏడ్చినా ప్రయోజనం లేకపోయింది.

తానే ఊళ్ళోకి వెళ్ళి ఎవరి సహాయాన్నైనా అర్థిస్తానని ఊరి వైపు నడిచింది నీలవేణి.

రాజిరెడ్డి ఇంటికి వెళ్ళి తనను, తన భర్తను, పిల్లలను తల దాచుకో నివ్వమని ప్రాధేయపడింది. సంగతంతా తెలిసిన రాజిరెడ్డి రెండు చేతులు జోడించి – "తల్లీ! మమ్మల్నిలా బతుకనియ్యి" అంటూ బయటికి గెంటేయించాడు.

లకుమారెడ్డి ఇంటికి వెళ్ళి అతని కాళ్ళ మీద పడింది. "అమ్మో! పాముతో చెలగాటమా! ఇక్కణ్నుంచి వెళ్ళిపో ..." అంటూ వెళ్ళగొట్టాడు.

అలాగే మరో రెడ్డి ... మరో రెడ్డి ... ఎవరూ వాళ్ళ పక్షాన నిలవడానికి ముందుకు రాలేదు.

వీథిలో నిలబడి బోరున ఏడ్వసాగింది నీలవేణి!

పెద్ద దొర నలుగురైదుగురు జీతగాండ్లతో పొలాల వైపు వెళ్ళి రామిరెడ్డిని కాలవలో పడేసి తన్ని కాళ్ళు చేతులు కట్టేయించి "నీ ముందే నీ భార్యనేం చేస్తానో చూద్దువు రారా..." అంటూ ఊళ్ళోకి లాక్కొచ్చాడు.

నీలవేణి గజ గజ వణికిపోయింది. పిల్లలు బల్లిలా ఆమెను కరుచుకొని నిల్చున్నారు.

ఆమె ముందు రామిరెడ్డిని మొహం మీద పెడేలు మని తన్నాడు పెద్దొర.

ఏడుస్తూ నీలవేణి "మీకు దండం పెడతాను .... మమ్మల్ని వదిలేయండి" అంటూ భర్తకు అడ్డంగా నిలుచుంది.

"రావే .... నిన్ను ..." అంటూ పిల్లలను లాగిపడేసి ఆమె రెక్క పట్టుకున్నాడు పెద్దొర.

అది ఊరు...

నడి వీధి ...

ఆమె ఏడుస్తున్నది... అరుస్తున్నది... గింజుకొంటున్నది...

పెద్దొర వికటాట్టహాసం చేస్తున్నాడు.

ఆమె చీరను లాగుతున్నాడు...

ఎవరిండ్లలో వాళ్ళున్నారు. సమాధుల్లోని శవాల్లాగా! కిటికీల నుంచి, తలుపు సందుల నుంచి చూస్తున్నారు.

ఈ విషయం ఎంకన్నకు తెలిసింది! ఎంకన్నది చాకలి వృత్తి. ఆ వృత్తి చేసే వాళ్ళందరికి ఎంకన్న మీద గౌరవం ఉంది. అతణ్ని తమ పెద్దగా భావిస్తారంతా –

"ఇదేమన్న ఊరా అడివిరా... నా పానం పోయినా సరే... ఈ అన్నాయం సూడలేను–" అంటూ కొడవల భుజాన వేసుకొని బయలుదేరాడు. అతనితో పాటు ఆ వాడలోని ఆడ, మగ కదిలారు – ఆ గుంపును చూసి పక్క వాడలోని జనానికి ధైర్యం వచ్చింది. వాళ్ళకూ ఈ అన్యాయం అరికట్టాలనే ఉంది – వాళ్ళూ వచ్చి చేరారు గుంపులో –

"ఆగు .." అన్న పిడుగులాంటి మాటలు విని వెనక్కు తిరిగి చూచాడు పెద్దొర.

"ఆళ్ళను ఒదిలేయి... లేకపోతె నిన్నిక్కణే నరుకుతం..." అన్నాడు దగ్గఱగా వస్తూ ఎంకన్న.

అతని చేతిలో కొడవలి ఉంది. అతని వెంటనున్న వాళ్ళ చేతుల్లో పారలు, గడ్డపారలు, కొడవండ్లు, రోకండ్లు, చీపురు కట్టలు ఉన్నాయి.

గుండె ఆగినంత పనైంది పెద్దదొరకు! అతని పొలాలు, పశువులు, నోట్ల కట్టలు, జీతగాండ్లు... ఎవరూ రాలేదు... ఏదీ రాలేదు... అతణ్ని రక్షించడానికి!

నిలువునా వణికి పోతున్నా .....

''మిమ్మల్ని ఏం చేస్తానో చూడండిరా...'' అన్నాడు పెద్దొర..

''ఏ పో... నువేం జేత్తవు? ఇసొంటి పని చేసిన వంటె నిన్ను నరికేది కాయం...'' అని ఎంకన్న ఉరిమి చూసే సరికి తోక ముడుచుకొని అక్కణ్నుంచి మెల్లగా జారుకున్నాడు.

రామిరెడ్డి కట్లు విప్పి వాళ్ళను తమ వాడకు తీసుక పోయాడు ఎంకన్న.

ఆమె కళ్ళలోని ఏదో పొర తొలగినట్లనిపించింది. ఎంకన్న కాళ్ళ మీద పడబోయింది.

''ఇదేంది తల్లీ...'' అంటూ ఆమెను ఆపి... ''నువ్వు మా తోబుట్టులాంటి దానివమ్మా... ఈ కులాలు, మతాలు మనం పెట్టుకున్నయి... మనం ఒక్క తల్లి పిల్లలం తల్లీ... ఈ లోకంల ఉన్నయి రొండే తెగలు. ఉన్నోళ్ళు, లేనోళ్ళు. ఉన్నోళ్ళ అగడాలు సిదక తొక్కాలంటె మనం కలిసుండాలె తల్లీ...'' అన్నాడు ఎంకన్న–

నీలవేణి కిపుడెంతో బలం వచ్చినట్లనిపించింది!

తాము ఒంటరి వాళ్ళం కాదనిపించింది.

అదురు తగ్గింది.

తేడా .... పి. శరత్‌కుమార్

సర్కస్ వాడి చెప్పుచేతల్లో వున్న
చిరుత
నిలువు అంటె నిలుస్తుంది.
కదులు అంటె కదుల్తుంది.
దానికి పౌరుషం వుండే గాని
పోరంటే ఏమిటో తెలీదు.
గారడీ వాడికి లోబడి వుండే నాగు
వుష్ అంటే పడగ విప్పుతుంది.
ష్చ్ అంటె పడుకుంటుంది
దానికి సాధించే పగ వుండే గాని
సమర మంటే ఏమిటో తెలీదు
కాని
ఒకడి కాలి క్రింద బానిసగా బ్రతికే
మనిషి
ఆడించినట్లుగా ఆడడు
పాడించి నట్లుగా పాడడు
అతనికి తిరగబడ్డం తెలుసు.
అంధకారంలో
వెలుగు తోరణాల్ని అలంకరించడం
తెలుసు.

నాకు సంబంధించినంత వరకు జీవితాన్ని మొత్తంగా అనుభవించాలి. నేను రచయితను. పౌరుష్ని, తండ్రి మొదలైనవి కూడా, అంచేత నా చుట్టూ జరిగే వాటన్నిటి గురించీ నాకు ఆసక్తి వుంది. నాకు నమ్మకం లేనిదాన్ని గురించి నేనెన్నడూ రాయలేదు. నా నమ్మకాలు, విశ్వాసాన్ని, బలపరచడానికి నేనెన్నడూ జంక లేదు.

నాకు ఆలోచన, ఆచరణ ఒకేవిధమైనవి. జీవితంలోని మంచి విషయాలు నాకు సంతోషాన్నిస్తాయి! బహురూపాలలో చెడుపు నన్ను బాధిస్తుంది. ఎక్కువ కాలం నేను జీవితంలోని బాధను నా కాలంలోని పతితత్వాన్ని, అనుభవిస్తుంటాను. నా మనస్సు రానున్న తరం వేపుకి పోతుంది దురాశలోనూ, నైతిక పతనంలోనూ, కూరుక పోతున్న గతకాలపు చేష్టలు ఫలితంగా బాధపడుతుంది స్వరాజ్యం వచ్చాక దేశంలో విలువలు అధోగతి పాలవుతున్నందుకు దిగ్భ్రాంతుడినవుతున్నాను గాఢవిషాదంలో నేను జీవిస్తున్నాను. సాహిత్యం ద్వారా నేనా 'విషాదపు బరువును దించుకోవాలను కుంటున్నాను. (కారంత్)